క్లుప్తంగా

ఘనంగా గ్రామదేవతల మారువారం పండగ



నీలమాంబకు పూజలు చేస్తున్న చుక్క వరలక్ష్మి

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవాని పాలెంలో కొలువైన కుంచమాంబ, నీలమాంబ అమ్మవార్ల మారువారం పండగ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవార్లకు ఆలయ అర్చకులు పసుపు, కుంకుమలతో పూజలు చేసి, సుగంధ మాలలు అలంకరించి అర్చనలు జరిపారు. వారం రోజులుగా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించారు. మారువారం పూజల్లో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక మహిళలు లలిత పారాయణం పఠించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

జ్ఞానం గొప్ప సంపద



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: జ్ఞానం గొప్ప సంపదని, దాన్ని ఎవరూ దొంగిలించలేరని ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం జిల్లా అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు చిత్రలేఖనం, జీకే, ఇంగ్లిష్ బోధన, తెలుగు పదాలు, కాగితాలతో వివిధ ఆకృతుల తయారీ తదితర వాటిలో వారం రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. గురువారం జనరల్ నాలెడ్జికి సంబంధించిన పలు అంశాలను చిన్నారులకు ఆమె వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్, రచయిత సత్తిరాజు, కార్మిక నాయకుడు బి.సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరం నిర్వహణపై సూచనలిస్తున్న జెడ్పీ మల్లయ్యనాయుడు


గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో గురువారం వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జోన్-8 కమిషనర్ మల్లయ్య నాయుడు ప్రారంభించారు. ఈ ప్రాంగణం పలు క్రీడలకు కేంద్రంగా ఉందని ఆయన అన్నారు. ఇక్కడి శిక్షణ శిబిరానికి మంచి స్పందన లభిస్తుందని చెప్పారు. జోన్‌లో ప్రతీ శిక్షణ శిబిరంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మల్కాపురం: మల్కాపురం సబ్ స్టేషన్ పరిధి ఎంఈఎస్ 33 కేవీ, ఐఎస్‌పీఆర్ఎల్ 33 కేవీ ఫీడర్లలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్-2 డీఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎంఈఎస్, ఐఎస్‌పీఆర్ఎల్ ఇండస్ట్రీ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

సమస్యల వలయంలో లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్

- రహదారులు, ప్రధాన కాలువలు అధ్వానం
- ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని వైనం
- పట్టించుకోవాలని స్థానికుల విజ్ఞప్తి



మధ్యలో నిలిచిపోయిన ప్రధాన కాలువ రక్షణ గోడ పనులు



లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో రాళ్లు తేలిన రోడ్డు



కూలిపోయిన కాలువ రక్షణ గోడ

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డులోని లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ సమస్యల వలయంలో చిక్కుకుంది. ఈ ప్రాంతంలోని రహదారులు, ప్రధాన కాలువలు అధ్వానంగా మారాయి. ఏళ్ల తరబడి ఇదే విధంగా ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేయాలని అటు అధికారులు.. ఇటు పాలకులు కూడా ఆలోచన చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏళ్లుగా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో ప్రధాన కాలువ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈ పనులను మధ్యలోనే నిలిపివేశారు. దీంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన కాలువ రక్షణ గోడ నిర్మాణానికి వేసిన ఇనుప తీగలు ఈ ప్రాంత వాసులకు ప్రాణ సంకటంగా మారాయి. ఒక ఇంటి గేటు కూడా తెరవలేని పరిస్థితి ఏర్పడింది. అధికారుల నిర్లక్ష్యానికి ఇదొక నిలువెత్తు నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు.

కానరాని మరమ్మతులు..

ఈ ప్రాంతంలోని రహదారులు ఇరుగ్గా ఉంటాయి. దీనికి తోడు పైప్‌లైన్ పనుల నిమిత్తం రోడ్లను తవ్వేయడంతో ఇబ్బందికరంగా తయారయ్యాయి. మట్టితో గోతులను పూడ్చినా.. వర్షాలకు ఇవి తిరిగి రాళ్లు తేలి అధ్వానంగా మారుతున్నాయి. ఏళ్లు గడిచినా రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో తరచూ చిన్న చిన్న ప్రమాదాల బారిన పడుతున్నామని నివాసులు వాపోతున్నారు. ఇక్కడి గణపతి ఆలయం వద్ద రెండేళ్ల కిందట కురిసిన వర్షాలకు కాలువ రక్షణ గోడ కూలిపోయింది. దీన్ని బాగు చేయాలని అధికారులు, నాయకుల వద్ద మొరపెట్టుకున్నా.. ఇంతవరకు బాగు చేయలేదని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఈ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయండి



మా ప్రాంతంలోని ప్రధాన కాలువ పనులు సగంలో ఆపేశారు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. రహదారులు అధ్వానంగా మారాయి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– మద్దాల ప్రసాద్, స్థానికుడు

అధికారులు స్పందించాలి



మా ప్రాంతంలోని ప్రధాన కాలువల ఆధునికీకరణను అధికారులు మరిచిపోయారు. చాలా ఏళ్ల నుంచి అవి అధ్వానంగానే ఉన్నాయి. చాలా మేరకు వాటి రక్షణ గోడలు కూలిపోయాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి

– విజయ్, లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్

పారిశుధ్యంపై అలసత్వం వద్దు



కరాసా వద్ద గెడ్డను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- 52వ వార్డులో డిప్యూటీ మేయర్‌తో కలిసి పర్యటన



నేతాజీనగర్ రహదారి గురించి కమిషనర్‌కు వివరిస్తున్న స్థానికులు

గోపాలపట్నం: పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వద్దని సచివాలయ కార్యదర్శులకు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సూచించారు. 52వ వార్డులో గురువారం ఉదయం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణతో కలిసి ఆయన పర్యటించారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో కమిషనర్‌కు శ్రీధర్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి రహదారులు, గ్రీన్ బెల్ట్‌ను పరిశీలించారు. గ్రీన్ బెల్ట్‌లో అభివృద్ధి చేసిన వాకింగ్ ట్రాక్‌ను చూసి చాలా బాగుందని కొనియాడారు. ప్రధాన కాలువలు, ఇంజినీరింగ్ పనులతోపాటు దీర్ఘకాలంగా ఉన్న పాస్‌పోర్ట్ కార్యాలయం నుంచి కరాసాకు వెళ్లే ఎయిర్‌పోర్ట్ స్థలాల్లోని రహదారిని పరిశీలించారు. నేతాజీనగర్ రోడ్డును 80 అడుగులుగా అభివృద్ధి చేయాలని జీవీఎంసీ కమిషనర్‌ను స్థానికులు కోరారు. ఇక్కడి నుంచి కరాసా, గౌరీనగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుధ్య పనులపై అలసత్వం వహిస్తే కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రధాన గెడ్డల్లో పూడికలు తీసే పనులు చేపట్టాలని ఆదేశించారు. డీఈ ఏడుకొండలు, సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎ.రాజేష్ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

29న పర్యావరణ దినోత్సవ పోటీలు

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోటీలను జయప్రదం చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ టీం సంయుక్తంగా పిలుపునిచ్చాయి. ఈ నెల 29న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో డ్రాయింగ్, వ్యాసరచన, ఎలక్యూషన్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. 'సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై పోటీలు జరుగుతాయని చెప్పారు. చిత్రలేఖనంలో పాల్గొనే వారికి డ్రాయింగ్ షీట్, వ్యాసరచన పోటీలో పాల్గొనే వారికి తెల్లకాగితాలు తామే ఇస్తామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు జరుగుతాయని, 8 గంటలకు డ్రాయింగ్, 9 గంటలకు వ్యాసరచన, 10 గంటలకు ఎలక్యూషన్, 11 గంటలకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. వివరాలకు 70327 81461, 83338 49955 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మేహాద్రి గెడ్డ ప్రాంతం పరిశీలన



బెహరా భాస్కరావుకు శ్మశానవాటిక సమస్యపై వినతిపత్రం అందిస్తున్న నిర్వాసితులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్ సమీప మేహాద్రి గెడ్డ ప్రాంతంలో గురువారం కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పర్యటించారు. మేహాద్రి గెడ్డ నిర్వాసితులకు కేటాయించిన శ్మశానవాటికను పరిరక్షించాలని కోరుతూ ఆయనకు స్థానికులు వినతిపత్రం అందించారు. దీన్ని ప్రత్యేకంగా సర్వే చేసి శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. శ్మశానవాటిక ప్రాంతాన్ని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలియజేశారు. దీనిపై స్పందించిన బెహరా.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సర్వే చేసి తగిన రక్షణ చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మేహాద్రి గెడ్డ, సిమెంట్ కంపెనీకి భూములు ఇచ్చిన నిర్వాసితులు పాల్గొన్నారు.

క్రీడలతో పిల్లలకు ఎంతో మేలు



వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న జోన్-5 కమిషనర్ కృష్ణ, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మర్రిపాలెం: క్రీడలు ఆడటం ద్వారా పిల్లల మానసిక వికాసానికి ఎంతో మేలు జరుగుతుందని జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అన్నారు. జీవీఎంసీ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా శ్రీమాధవ భారతి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కంచరాన సూర్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం 50వ వార్డు కనకదుర్గా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు సెల్‌ఫోన్‌లు వ్యసనంగా మారిపోయాయని, క్రీడలు అలవాటైతే వాటికి దూరంగా ఉండే అవకాశం ఉంటుందని, తద్వారా భవిష్యత్తులో బాగుంటారన్నారు. కార్పొరేటర్ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల శారీరికంగా దృఢంగా, మానసికంగా ఉల్లాసంగా, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉంటారన్నారు. పిల్లలకు వెయిట్ లిఫ్టింగ్, కరాటే, బాక్సింగ్ వంటివి కోచ్‌లు నేర్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, సనపల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎల్ దృష్టికి వాకర్స్ సమస్యలు



ఇండస్ట్రియల్‌ఎస్టేట్‌లో వాకర్స్‌తో ఎంపీ జీవీఎల్ నరసింహారావు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీ స్టార్స్ వాకర్స్ సభ్యులను గురువారం మార్నింగ్ వాక్‌లో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు కలిశారు. వాకర్స్ పార్కులు ఏర్పాటు చేయాలని, వాకర్ల సమస్యలను పరిష్కరించాలని ఆయనకు సభ్యులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి.వి ష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా హెల్త్ సర్వే

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస వార్డు సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది హెల్త్ సర్వే నిర్వహిస్తున్నారు. ఆరోగ్య విభాగం సారథ్యంలో నిర్వహిస్తున్న కా ర్యక్రమంలో ప్రతీ కుటుంబం ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని గుర్తింపు నంబర్ ఇవ్వనున్న ట్లు సిబ్బంది తెలిపారు. ప్రతీ కుటుంబంలో ఆ రోగ్య స్థితిగతులు, ఎవరు ఏ మందులు వాడుతున్నారో తెలుసుకుంటామన్నారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు అందిస్తున్న నాయకులు

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గురువారం షిప్‌యార్డ్ సమీపంలోని బస్‌స్టాప్ వద్ద టీడీపీ వ్యవస్థాపకుడు, సినీ దిగ్గజం ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు విల్లా రామ్మోహనరావు, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ సెక్రటరీ చంటిబాబు, షిప్‌యార్డ్ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఎం.వి.రమణమూర్తి, సెక్రటరీ రమేష్‌లు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ, వైఎస్సార్‌టీయూసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఎంఎస్, టీఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, బీసీ అసోసియేషన్ నాయకులు, షిప్‌యార్డ్ అధికారులు, కార్మికులు, అభిమానులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసై వ్యక్తి బలవన్మరణం

గోపాలపట్నం: వ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం గొల్ల వీధిలో జరిగింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలిలా.. వెంకటాపురం గొల్ల వీధికి చెందిన గంర్రెడ్డి సాయికుమార్(30) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం మద్యం తాగి భార్యతో గొడవ పడ్డాడు. ఆమె తన ఇద్దరి పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈక్రమంలో మద్యం మత్తులో ఇంట్లో ఫ్యాన్ హుక్‌కు చీర కట్టి సాయికుమార్ ఉరి వేసుకున్నాడు. గురువారం సాయంత్రం వరకు ఇంటి తలుపులు తీసి ఉండటం, ఎవరూ అలికిడి లేకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు కిటికీలో నుంచి చూశారు. ఉరి వేసుకుని సాయికుమార్ కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సీఐ ఇ.నరసింహారావు ఆధ్వర్యంలో ఎస్ఐ అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేపట్టారు.

కార్మికవర్గాన్ని దెబ్బ కొట్టే యత్నమే ప్రైవేటీకరణ

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని, ఉక్కు ఉత్పత్తిని నిలిపేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 833వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ప్రైవేటీకరణను ఆపాలని, సంస్థను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరు మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నిత్యం పడిగాపులు

- పోర్టు హాస్పిటల్ వద్ద రోగుల అవస్థలు
- వేకువజాము నుంచే ఓపీ కోసం బారులు
- వైద్యులు వచ్చే వరకు తప్పని ఎదురుచూపులు



హైవే పక్కనున్న పోర్టు హాస్పిటల్



ఓపీ సేవల కోసం వేకువజాము నుంచి వేచి ఉన్న రోగులు, వారి సహాయకులు

తాటిచెట్లపాలెం: జాతీయ రహదారి పక్కనే ఉన్న పోర్టు హాస్పిటల్.. ఒకప్పుడు పోర్టు ఉద్యోగులు, వారి కుటుంబాలకు అపర సంజీవని. ఎటువంటి ఆరోగ్య సమస్యయినా చిటికెలో నయం చేసేవారు. ఏ మందు కావాలన్నా క్షణాల్లో ఇచ్చేవారు. ఎప్పుడో ఓసారి బయట నుంచి మందులు తెచ్చి ఇచ్చేవారు.. బయటి హాస్పిటల్స్, డయాగ్నోస్టిక్ లాబ్స్‌కు రిఫర్ చేసేవారు.. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆరోగ్యం బాగోలేక ఈ ఆస్పత్రిలో చూపించుకోవాలంటే రోగులు, వారి సహాయకులు నిత్యం నరకం చూస్తున్నారు.

అందుబాటులో లేని అత్యవసర వైద్యులు

నాటి విశాఖపట్నం పోర్టు ట్రస్ట్(నేటి విశాఖపట్నం పోర్టు అథారిటీ)లో పనిచేసే ఉద్యోగులు, వారి కుటుంబాలు, మాజీ ఉద్యోగుల కోసం సుమారు మూడు దశాబ్దాల కిందట పోర్టు గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ ఏర్పాటు చేశారు. అప్పట్లో ఏ సమస్య వచ్చినా వెంటనే నయం చేసేవారు. ప్రస్తుతం ఒక చిన్న సమస్యకు పదే పదే తిరగడం, తిప్పించడం జరుగుతోంది. అత్యవసర చికిత్సలు అందించే క్యాజువాల్టీలో రాత్రి వేళల్లో అనుభవజ్ఞులైన వైద్యులు కూడా అందుబాటులో ఉండటం లేదు. కొత్తగా వచ్చిన జూనియర్ డాక్టర్లకు ఇక్కడ డ్యూటీలు వేస్తున్నారు. రాత్రి వేళ ఎవరైనా అత్యవసర సమస్యతో వస్తే తాత్కాలిక ఉపశమనం కోసం మందులు, లేదా ఇంజక్షన్ ఇచ్చి మరుసటి రోజు ఓపీలో చూపించుకోవాలని సూచిస్తున్నారు.

ప్రస్తుతం ఇదీ పరిస్థితి..

ఏదైనా ఆరోగ్య సమస్య, వ్యాధి వచ్చి పోర్టు హాస్పిటల్‌లో చూపించుకోవాలంటే తెల్లవారుజామునే వచ్చి తమ హాస్పిటల్ పుస్తకాలు లైన్‌లో పెట్టాలి. ఉదయం 8 లేదా 8.30 గంటల తరువాత నంబర్లు వేసే వ్యక్తులు వచ్చి రోగులకు ఓపీ నంబర్లు వేస్తారు. వాటి ప్రకారం ఆయా ఓపీల దగ్గర డాక్టర్లు వచ్చే వరకు పేషెంట్లు వేచి ఉండాలి. వైద్యులు వచ్చి అవసరమైన మందులు, పరీక్షలు వంటివి రాస్తారు. మందుల కోసం మళ్లీ క్యూ లైన్లు కట్టాల్సిందే. పోర్టు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఎవరైనా ఆరోగ్యం బాగోలేక ఈ ఆస్పత్రిలో కేవలం డాక్టర్‌కు చూపించుకోవడానికి తెల్లవారు 4 నుంచి మధ్యాహ్నం 12 లేదా ఒంటి గంట వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎక్కడెక్కడ నుంచో వస్తుంటారు...

దాదాపు 30 ఏళ్ల కిందట పోర్టులో పనిచేసే ఉద్యోగులందరూ సాలగ్రామపురం, కంచరపాలెం, తాటిచెట్లపాలెం పరిసర ప్రాంతాల్లో ఉండేవారు. వీరంతా రిటైరయ్యాక పెందుర్తి, చినముషిడివాడ, ఎంవీపీ కాలనీ, మధురవాడ ఇలా చెదరిపోయారు. పోర్టు హాస్పిటల్‌లో చికిత్స కోసం ఆయా ప్రాంతాల నుంచి తెల్లవారుజామున బయలుదేరి ఇబ్బంది పడుతూ వస్తుంటారు. వారితోపాటు సహాయకులు కూడా రోజంతా వేచి చూడాల్సిందే.

మందులకు మరో ప్రహసనం..

గతంలో డాక్టర్లు ఏ మందు రాసినా ఇదే హాస్పిటల్‌లోని ఫార్మసీ కౌంటర్ నుంచి వెంటనే ఇచ్చి పంపించేవారు. నేడు కొన్ని యాంటీ బయాటిక్స్ కావాలన్నా కూడా ఇక్కడ దొరకడం లేదు. వాటిని బయట నుంచి రప్పిస్తుంటారు. ఈ మందుల కోసం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి క్యూ కట్టాలి. పుస్తకాలు లైన్‌లో పెట్టాలి. సాయంత్రం 4 గంటల తరువాత మందులు ఇవ్వడం ప్రారంభిస్తారు.

ప్రతి దానికీ రిఫరల్..

ఇప్పుడు ఇక్కడ ఏ సమస్య వచ్చినా.. బయట ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. దీనికోసం కూడా నానా పాట్లు పడి రిఫరల్ లెటర్స్ రాయించుకోవాలి. ఇలా చాలా ప్రక్రియే ఉంది. ఇక టెస్టులకు కూడా ఇదే పరిస్థితి. బయట డయాగ్నోస్టిక్ సెంటర్లకు కొన్ని టెస్టులను రాస్తున్నారు. కారణం ఇక్కడ పరికరాలు లేకపోవడమే. ఇక్కడున్న హాస్పిటల్‌ను, సదుపాయాలను పూర్తిగా నిర్వీర్యం చేసేశారు. దీని కారణంగా రోగులు, వారి సహాయకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వచ్చిన వీపీఏ కొత్త చైర్మన్ దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుంటే.. ఎంతో మంది నిత్యం ఎదుర్కొంటున్న కష్టాలకు పరిష్కారం దొరుకుతుందని పలువురు సూచిస్తున్నారు.

పబ్లిక్ డిమాండ్

రోడ్డు మలుపులో స్తంభం



ప్రకాష్‌నగర్ ఇరుకు రోడ్డు మలుపులో ఉన్న విద్యుత్ స్తంభం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్‌లోని ఇరుకు రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం ఇబ్బందికరంగా మారింది. సర్వీస్ రోడ్డు మలుపు వద్ద ఈ స్తంభం ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. వీధిలోకి ఆటో కూడా వెళ్లలేని పరిస్థితి. సంబంధిత అధికారులు పరిశీలించి ఈ సమస్యకు తగు పరిష్కారం చూపాలి.

– గురునాథ్, ప్రకాష్‌నగర్

మొక్కల పంపిణీ

పెదగంట్యాడ: ఎన్టీపీసీ అందజేసిన సుమారు 1000 కొబ్బరి, జామ, మామిడి, గులాబ్‌జామ్, సపోటా, నేరేడు వంటి పలు పండ్ల రకాల మొక్కలను కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి చేతుల మీదుగా గురువారం పిట్టవానిపాలెం, దాసరిపేట, చిన్నపాలెం గ్రామాల స్థానికులకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొవిరి షణ్ముఖ, శివకుమార్ పాల్గొన్నారు.